చైనాకు భారత్ షాక్

ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

షా ఆలమ్ (మలేషియా): ప్రతిష్ఠాత్మక ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో పటిష్ఠ చైనాకు భారత్ దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. బుధవారం మహిళల విభాగంలో భారత్ 3-2తో చైనాపై అద్భుత విజయం సాధించింది. గాయం కారణంగా చాలా రోజులు ఆటకు దూరమైన స్టార్ షట్లర్ పీవీ సింధు తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకుంది. టాప్‌సీడ్ చైనాపై గెలుపు ద్వారా గ్రూపు-డబ్ల్యూ నుంచి భారత్ నాకౌట్‌కు అర్హత సాధించింది. మరోవైపు పురుషుల టీమ్ ఈ టోర్నీలో 4-1తో హాంకాంగ్‌పై గెలిచి నాకౌట్‌లో నిలిచింది. ఇదిలా ఉంటే గత అక్టోబర్ నుంచి టోర్నీలకు దూరంగా ఉన్న సింధు సింగిల్స్ పోరులో 21-17, 21-15తో హాన్ యుపై గెలిచింది. నలభై నిమిషాల పాటు సాగిన పోరులో సింధు అద్భుత ప్రదర్శన కనబరిచింది. డబుల్స్‌లో భారత ద్వయం తనీషా క్యాస్ట్రో, అశ్విని పొనప్ప 19-21, 16-21తో లియు షెంగ్, టాన్‌నింగ్ జోడీ చేతిలో ఓడింది. మరో సింగిల్స్‌లో అశ్మిత 13-21, 15-21తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ వాంగ్ జీపై ఓటమిపాలైంది. దీంతో భారత్ 1-2తో వెనుకంజలో నిలిచింది. ఆ తర్వాత జరిగిన డబుల్స్ పోరులో త్రిసా జాలీ, గాయత్రీ గోపీచంద్ జోడీ 10-21, 21-18, 21-17తో జింగ్, ల్యు జు మిన్ జంటపై గెలిచి భారత విజయంలో కీలకమయ్యారు. చివరగా జరిగిన పోరులో అన్మోల్ 22-20, 14-21, 21-18తో వు లుయో యును ఓడించి జట్టు విజయంలో కీలకమయ్యాడు.

ఫైనల్లో అల్ఫా, ఏంజెల్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ నాలుగో ఎడిషన్‌లో టీమ్ అల్ఫా, సమా ఏంజెల్స్ టైటిల్ పోరులోకి దూసుకెళ్లాయి. బుధవారం గచ్చిబౌలిలో హోరాహోరీగా సాగిన సెమీఫైనల్లో సమా ఏంజెల్స్ టీమ్ 5-3తో డీఎస్ఆర్ జట్టుపై గెలిచింది. నువ్వా నేనా అన్నట్లు సాగిన మరో సెమీస్‌లో విల్లాజియో హైల్యాండర్స్, టీమ్ అల్ఫా స్కోరు 4-4తో సమమైంది. అయితే విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన టై బ్రేక్‌లో అల్ఫా 2-1తో గెలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ధాయలాండ్‌లో ఈ నెల 23న జరిగే తుది పోరులో టీమ్ అల్ఫా, సమా ఏంజెల్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.

న్యూజిలాండ్ 211 ఆలౌట్

- **దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు**

డేన్ పీడ్ (5/89)

హామిల్టన్(న్యూజిలాండ్): దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. సఫారీ స్పీడ్‌స్టర్ డేన్ పీడ్(5/89) ఐదు వికెట్ల విజృంభణతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకు కుప్పకూలింది. డేన్ బౌలింగ్ ధాటికి కివీస్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ డేన్ తన కెరీర్ బెస్ట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. డేన్‌కు తోడు పాట రన్స్(3/39) జత కలువడంతో కివీస్ ఒకానొక దశలో 183 పరుగులకే 9 వికెట్లు కోల్పోయింది. ఆఖర్లో నీల్ వాగ్నర్(33) బ్యాటు ఝుళిపించడంతో కివీస్ రెండు వందల మార్క్ దాటింది. విలియమ్సన్(43), టామ్ లాథమ్(40) ఫర్వాలేదనిపించారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 220/6 రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 242 పరుగులకు ఆలౌటైంది. 22 పరుగుల తేడాతో సఫారీలు మిగిలిన నాలుగు వికెట్లు కోల్పోయారు. రూర్కీ(4/59), రచిన్(3/33) ఆకట్టుకున్నారు. దక్షిణాఫ్రికా ప్రస్తుతం 31 పరుగుల ఆధిక్యంలో ఉన్నది.

మార్చి ఆఖర్లో ఐపీఎల్!

న్యూఢిల్లీ: ఐపీఎల్ మార్చి ఆఖరి వారంలో మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఐపీఎల్ చైర్మన్ అరుణ్‌సింగ్ ధుమాల్ బుధవారం ఒక ప్రకటనలో ధృవీకరించాడు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరిగే అవకాశమున్న నేపథ్యంలో ఐపీఎల్ తేదీలపై ఒకింత ఆసక్తి నెలకొన్నది. దీనిపై అరుణ్ స్పందిస్తూ 'సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వంతో కలిసి త్వరలో సంప్రదింపులు జరుపుతాం. ఎన్నికల షెడ్యూల్ గురించి వేచి చూస్తున్నాం. తేదీలను బట్టి ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతాయో దాన్ని అనుసరించి లీగ్ షెడ్యూల్‌ను రూపొందించాలనుకుంటున్నాం.మార్చి ఆఖరి నుంచి ఐపీఎల్ మొదలయ్యే అవకాశముంది' అని అన్నాడు.

శ్రీనిధి గెలుపు జోరు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్ చాంపియన్‌షిప్‌లో శ్రీనిధి దక్కన్ ఫుట్‌బాల్ క్లబ్(ఎస్‌డీఎఫ్‌సీ) గెలుపు జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఎస్‌డీఎఫ్‌సీ 3-0తో టీఆర్‌ఏయూ ఫుట్‌బాల్ క్లబ్‌పై అద్భుత విజయం సాధించింది. శ్రీనిధి తరపున రిల్వాన్ హసన్, కాస్టెండా, బ్రాండెన్ గోల్స్ చేశారు.

మళ్లీ పోరాటం చేస్తాం: రెజ్లర్లు

న్యూఢిల్లీ: జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్(డబ్ల్యూఎఫ్ఐ)పై యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్(యూడబ్ల్యూడబ్ల్యూ) నిషేధం ఎత్తివేయడంలో డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్‌సింగ్ మోసాపూరితంగా వ్యవహరించాడని స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా ఆరోపించారు. డబ్ల్యూఎఫ్ఐ నూతన కార్యవర్గానికి వ్యతిరేకంగా తిరిగి పోరాటం చేస్తామని రెజ్లర్లు హెచ్చరించారు.

రాజ్‌కోట్ ఫైట్

నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ మూడో టెస్టు

జురెల్, సర్ఫరాజ్ అరంగేట్రానికి చాన్స్

ఇద్దరు పేసర్లతో ఇంగ్లండ్ బరిలోకి

ఉదయం: 9.30 నుంచి స్పోర్ట్స్-18లో

భారత్, ఇంగ్లండ్ మరో కీలక పోరుకు సిద్ధమయ్యాయి. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ఇప్పటికే చెరో మ్యాచ్ గెలిచి సమంగా ఉన్న నేపథ్యంలో ఆధిక్యం దక్కించుకునేందుకు ఇరు జట్లు తహతహలాడుతున్నాయి. గురువారం నుంచి రాజ్‌కోట్‌లో మూడో టెస్టుకు తెరలేవనుంది. విరాట్ కోహ్లీ, రాహుల్ గైర్హాజరీలో టీమ్‌ఇండియా యువ క్రికెటర్ల మేళవింపుతో కనిపిస్తుంటే.. ఇంగ్లండ్ భారీ మార్పులేమి లేకుండానే బరిలోకి దిగుతున్నది. ధృవ్ జురెల్, సర్ఫరాజ్‌ఖాన్ అరంగేట్రం దాదాపు ఖాయంగా కనిపిస్తున్నది. మొత్తంగా ప్రపంచంలోని రెండు అత్యుత్తమ జట్ల మధ్య ఆసక్తికర పోరు జరిగే అవకాశముంది.

రోహిత్ సారథ్యంలోనే..

వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జూన్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచ కప్ టోర్నీలో రోహిత్‌శర్మ సారథ్యంలోనే భారత్ బరిలోకి దిగుతుందని బీసీసీఐ కార్యదర్శి జై షా స్పష్టం చేశాడు. తద్వారా గత కొన్ని రోజులుగా రోహిత్ కెప్టెన్సీపై వస్తున్న వార్తలకు తాజాగా పుల్‌స్టాప్ పడింది. బుధవారం సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియం పేరును నిరంజన్ షా పేరు మీద మార్చిన కార్యక్రమంలో జై షా పాల్గొన్నాడు. ఈ సందర్భంగా పలు అంశాలపై అతను మాట్లాడుతూ 'స్వదేశం వేదికగా జరిగిన వన్డే ప్రపంచ కప్‌లో భారత్ ఓడినప్పటికీ అందరి మనసులు గెలుచుకుంది. బార్బడోస్‌లో జరిగే వరల్డ్‌కప్ ఫైనల్లోనూ రోహిత్ సారథ్యంలోని టీమ్‌ఇండియా విజయకేతనం ఎగురవేస్తుందన్న నమ్మకం నాకుంది' అని అన్నాడు. ఈ కార్యక్రమంలో చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగర్కార్ సమక్షంలో జై షా ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ఇదిలా ఉంటే విరాట్ కోహ్లీ వ్యక్తిగత కారణాలతో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడని జై షా పేర్కొన్నాడు. బలమైన కారణంతోనే కోహ్లీ సిరీస్‌లో భాగం కాలేకపోయాడని షా చెప్పుకొచ్చాడు.

రాజ్‌కోట్: ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో కీలకమైన మూడో మ్యాచ్‌కు భారత్, ఇంగ్లండ్ సిద్ధమయ్యాయి. పది రోజుల విరామం తర్వాత బరిలోకి దిగుతున్న ఇరు జట్లు వ్యూహ, ప్రతి వ్యూహాలతో పోటీకి దిగుతున్నాయి. నిరంజన్‌షా స్టేడియం వేదికగా గురువారం నుంచి మూడో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఓవైపు విరాట్ కోహ్లీ వ్యక్తిగత కారణాలతో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు దూరమైతే..మరోవైపు కేఎల్ రాహుల్ గాయం కారణంగా మూడో టెస్టుకు అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో జట్టులో అనుభవలేమి స్పష్టంగా కనిపిస్తున్నది. టాపార్డర్‌లో కెప్టెన్ రోహిత్‌శర్మ మినహా అనుభవజ్ఞుడైన బ్యాటర్ కనిపించడం లేదు. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ , శుభ్‌మన్ గిల్ ఫామ్‌మీద ఉండటం భారత్‌కు కలిసి రానుంది. ఇప్పటికే అరంగేట్రం చేసిన రజత్ పాటిదార్‌కు తోడు వికెట్ కీపర్, బ్యాటర్ కేఎస్ భరత్ స్థానంలో ధృవ్ జురెల్ జట్టులోకి వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కీపింగ్‌లో ఆకట్టుకుంటున్న భరత్..బ్యాటింగ్‌లో విఫలమవుతుండటం జట్టుకు భారంగా మారింది. మరోవైపు దేశవాళీ క్రికెట్‌లో 46.47 సగటుతో పరుగులు సాధించిన జురెల్ దూకుడుగా బ్యాటింగ్ చేయడంలో సిద్ధహస్తుడు కావడం అనుకూలాంశం కానుంది. కేఎల్ రాహుల్ స్థానాన్ని ముంబైకర్ సర్ఫరాజ్‌ఖాన్‌తో భర్తీ చేయనున్నారు. దేశవాళీ క్రికెట్‌లో దుమ్మురేపుతున్న సర్ఫరాజ్ అవకాశమొస్తే సత్తాచాటేందుకు పట్టుదలతో ఉన్నాడు. మొత్తంగా టీమ్‌ఇండియా మిడిలార్డర్‌లో అనుభవలేమి కనిపిస్తున్నది. బౌలింగ్‌లో ముగ్గురు స్పిన్నర్లు అశ్విన్,జడేజా, కుల్దీప్‌యాదవ్ ఉండగా, పేస్ బాధ్యతలను బుమ్రా, సిరాజ్ పంచుకోనున్నారు. గత రెండు టెస్టుల్లో బుమ్రా అదరగొడుతున్నాడు. రివర్స్ స్వింగ్‌తో ఇంగ్లండ్ బ్యాటర్ల నడ్డివిరుస్తున్నాడు.

ఇద్దరు పేసర్లతో ఇంగ్లండ్: బజ్‌బాల్ వ్యూహాన్ని నమ్ముకున్న ఇంగ్లండ్ అందుకు తగ్గట్లు ముందుకెళుతున్నది. సమిష్టి ప్రదర్శనతో అనూహ్యంగా తొలి టెస్టులో చిరస్మరణీయ విజయం సాధించిన ఇంగ్లండ్.. విశాఖ టెస్టులో కంగుతిన్నది. టీమ్‌ఇండియా స్పిన్ దాడికి బుమ్రా పేస్ విజృంభణ తోడు కావడంతో ఇంగ్లండ్ ఓటమి వైపు నిలువాల్సి వచ్చింది. రాజ్‌కోట్ పిచ్ పచ్చికతో కనిపిస్తున్న నేపథ్యంలో షోయబ్ బషీర్‌ను తప్పిస్తూ మార్క్ వుడ్‌ను తిరిగి జట్టులోకి తీసుకుంది. జేమ్స్ అండర్సన్ జతగా వుడ్ పేస్ బౌలింగ్‌ను పంచుకోనున్నాడు. గాయంతో జాక్ లీచ్ సిరీస్‌కు పూర్తిగా దూరం కాగా, టామ్ హార్ట్‌లే, రేహాన్ స్పిన్ విభాగాన్ని నడిపించనున్నారు.

1

టెస్టుల్లో ఐదు వందల వికెట్ల మైలు రాయికి టీమ్ ఇండియా స్పిన్నర్ అశ్విన్ మరో వికెట్ దూరంలో ఉన్నాడు.

జట్ల అంచనా

భారత్: రోహిత్‌శర్మ(కెప్టెన్), జైస్వాల్, గిల్, పాటిదార్, సర్ఫరాజ్‌ఖాన్, జడేజా, జురెల్/భరత్, అశ్విన్, కుల్దీప్‌యాదవ్, బుమ్రా, సిరాజ్

ఇంగ్లండ్: స్టోక్స్(కెప్టెన్), క్రాలే, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, రేహాన్ అహ్మద్, టామ్ హార్ట్‌లే, వుడ్, అండర్సన్.

అమెరికా అధ్యక్ష పదవి నుంచి బైడెన్‌ను తొలగించండి

కమలా హారిస్‌కు అటార్నీ జనరల్ లేఖ

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (81) వయసు, జ్ఞాపకశక్తిపై విమర్శలు వెల్లువెత్తుతుండటంతో ఆయనను పదవి నుంచి తొలగించాలని వెస్ట్ వర్జీనియా అటార్నీ జనరల్ పాట్రిక్ మోరిసే కోరారు. అందుకోసం 25వ రాజ్యాంగ సవరణను అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తూ మంగళవారం ఆయన అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు ఓ లేఖ రాశారు. బైడెన్ జ్ఞాపకశక్తిలో అనేక లోపాలను గుర్తించామంటూ అమెరికా స్పెషల్ కౌన్సెల్ రాబర్ట్ హుర్ గత వారం ఓ నివేదికను విడుదల చేసిన విషయాన్ని ఆ లేఖలో ప్రస్తావించారు. బైడెన్ జ్ఞాపకశక్తిలో వచ్చిన మార్పును అమెరికన్లు చాలా కాలం నుంచి గమనిస్తున్నారని, బైడెన్ జ్ఞాపకశక్తి లోపాలు స్పష్టంగా కనిపించాయని తెలిపారు.

అమెరికాలో భారతీయ కుటుంబం మృతి

- **అనుమానాస్పద స్థితిలో మరణించిన దంపతులు, కవల పిల్లలు**
- **రెండు నెలల్లో రెండో ఘటన**

న్యూయార్క్, ఫిబ్రవరి 14: అమెరికాలోని కాలిఫోర్నియాలో ఓ భారతీయ కుటుంబం అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. మృతుల్లో నాలుగేండ్ల వయసున్న కవలలు కూడా ఉన్నారు. అగ్రరాజ్యంలో భారతీయ కుటుంబం మృతి చెందడం రెండు నెలల్లో ఇది రెండోది. దీనికి తోడు అమెరికాలోని పలు ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులు, విద్యార్థుల వరుస మరణాలు అమెరికాలోని భారతీయ సమాజాన్ని కలవరపెడుతున్నాయి. సోమవారం శాన్ మటియోలో జరిగిన తాజా ఘటనలో మృతులను కేరళకు చెందిన ఆనంద్ సుజీత్ హెన్రీ, ఆయన భార్య అలైస్ ప్రియాంక, వారి కుమారులైన కవల సోదరులుగా గుర్తించారు. వెల్ఫేర్ చెక్‌లో కుటుంబం స్పందిచకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారొచ్చి చూడగా విషాదం వెలుగు చూసింది. భార్యాభర్తల శరీరాలపై తుపాకి గాయాలు ఉన్నాయి. చిన్నారుల మృతదేహాలపై ఎలాంటి గాయాలు లేవు. పోస్టుమార్టం తర్వాత మరణానికి కారణం తెలుస్తుందని పోలీసులు తెలిపారు. కాగా, డిసెంబర్ 2016లో సుజీత్ విడాకుల కోసం కోర్టును ఆశ్రయించాడు. అదింకా విచారణలో ఉంది. వీరి మరణాలకు బహుశా కుటుంబ కలహాలే కారణమై ఉంటుందని అనుమానిస్తున్నారు.

ఉక్రెయిన్ చేతిలో ఓడితే పుతిన్‌ను హతమారుస్తారు

అమెరికన్ సెనెటర్లతో మస్క్ వ్యాఖ్యలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఓడిపోయే ప్రసక్తే లేదని టెస్లా, స్పేస్ ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ స్పష్టం చేశారు. ఒకవేళ ఈ యుద్ధం నుంచి పుతిన్ వెనక్కి తగ్గితే ఆయనను హత్య చేసే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో పుతిన్ యుద్ధాన్ని కొనసాగిస్తూనే ఉంటారని అన్నారు. 'ఎక్స్ స్పేసెస్' సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో సోమవారం రిపబ్లికన్ పార్టీ సెనెటర్లతో జరిగిన చర్చలో మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధంలో ఉక్రెయిన్ గెలుస్తుందని భావిస్తున్నవారంతా ఊహా లోకంలో జీవిస్తున్నారన్న విస్కాన్సిన్ సెనెటర్ రాన్ జాన్సన్ అభిప్రాయంతో మస్క్ ఏకీభవించారు. అమెరికా తాజాగా ప్రకటించిన ఆర్థిక సాయం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని, మరింత దీర్ఘకాలంపాటు యుద్ధం కొనసాగడం ఉక్రెయిన్‌కే నష్టమని పేర్కొన్నారు. గతంలో ఇదే అభిప్రాయాలను వ్యక్తం చేసినప్పుడు తనను చాలా మంది విమర్శించారని మస్క్ గుర్తుచేస్తూ.. వాస్తవాలను తెలుసుకోవాలని విమర్శకులకు సూచించారు.

మే 12న తెరుచుకోనున్న బద్రీనాథ్ ధామ్

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ ధామ్‌ను మే 12న తెరవనున్నట్లు బద్రీనాథ్-కేదార్‌నాథ్ దేవాలయాల కమిటీ చైర్మన్ అజేంద్ర అజయ్ బుధవారం తెలిపారు. మే 12న ఉదయం 6 గంటల నుంచి భక్తులను అనుమతించనున్నట్లు చెప్పారు. వసంత పంచమి సందర్భంగా నరేంద్ర నగర్ ప్యాలెస్‌లో ప్రత్యేక పూజల అనంతరం ఈ ప్రకటన చేశారు. ఈ ఏడాది చార్‌ధామ్ యాత్రలో పాల్గొనే భక్తుల కోసం ఏర్పాట్లను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

'తల్లిపై డబ్బు, సమయం వెచ్చించడం గృహహింస కాదు'

ముంబై: భర్త తన తల్లితో కొంత సేపు గడపటం, ఆమెకు కొంత డబ్బు ఇవ్వడం తన భార్యను వేధించడం కిందకు రాదని ముంబై కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. ఆ భర్తపైన, ఆయన బంధువులపైనా గృహహింస నుంచి మహిళల పరిరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, తనకు నష్టపరిహారం, తమ కుమార్తెకు పోషణ ఖర్చులు ఇప్పించాలని కోరుతూ భార్య దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. పిటిషనర్ మహారాష్ట్ర సచివాలయంలో అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఆమె 2015లో దాఖలు చేసిన పిటిషన్‌ను మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. తన భర్త తరచూ ఆయన తల్లికి ఆర్థిక సాయం చేయడం, ఆమెతో కొంత సమయాన్ని గడుపుతుండటం వల్ల తమ మధ్య ఘర్షణలు జరుగుతున్నట్లు కోర్టుకు తెలిపారు. తమ వివాహానికి ముందు తన అత్తగారి మానసిక ఆరోగ్య పరిస్థితి గురించి తనకు తెలియదని చెప్పారు. దీనివల్ల కుటుంబంలో ఉద్వేగాలు మరింత పెరిగాయన్నారు.

చావులోనూ ఒక్కటిగానే

కారుణ్య మరణం పొందిన నెదర్లాండ్స్ మాజీ ప్రధాని దంపతులు

న్యూఢిల్లీ: నెదర్లాండ్స్ మాజీ ప్రధాని డ్రయెస్ వ్యాన్ అగ్ట్, ఆయన భార్య ఇజెనీ చావులోనూ చేయి వీడలేదు. ఈ నెల 5న వారు తమ నిజ్‌మెజెన్‌లో కారుణ్య మరణం పొందినట్టు అగ్ట్ ప్రారంభించిన మానవ హక్కుల సంఘం వెల్లడించింది. అగ్ట్, ఇజెనీ ఇద్దరూ 70 ఏళ్లకు పైగా దాంపత్య జీవితాన్ని అనుభవించారు. మాజీ ప్రధాని దంపతులిద్దరూ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ చట్టపరమైన హక్కు అయిన కారుణ్య మరణాన్ని కోరుకున్నారు.

- **కప్పపై పుట్టగొడుగు!**

కప్పపై పుట్టగొడుగు మొలవడం ఏంటి అని ఆశ్చర్యపోతున్నారా? పశ్చిమ కనుమల్లో కనిపించిన ఈ కప్పను చూసి శాస్త్రవేత్తలు కూడా షాక్ అయ్యారు. సజీవ ప్రాణులపై పుట్టగొడుగు మొలవడం మొదటిసారి కావడంతో దానికి గల కారణాలను అన్వేషించే పనిలో పడ్డారు. అసలు అది పుట్టగొడుగో కాదో పరిశోధించాలని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా రివర్‌సైడ్ ఫంగల్ ఎకాలజిస్ట్ సిడ్నీ గ్లాస్‌మన్ సూచించారు.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.